వరదముంపు సమస్యను పరిష్కరించండి

● ఇబ్బంది పడుతున్న మహాభారత్‌నగర్, బీజేఆర్‌నగర్ వాసులు

ఖైరతాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ముందు చూపు లేకుండా జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు చేసిన పనులతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఖైరతాబాద్ బీజేఆర్‌నగర్‌లో వర్షం నీరు వెళ్లేందుకు రోడ్డు మధ్య నుంచి నిర్మించిన బాక్స్ డ్రైన్ పనులతో స్థానికులకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలగడంతోపాటు పాత రోడ్డు నుంచి దాదాపు రెండున్నర అడుగుల ఎత్తులో బాక్స్ డ్రైన్ నిర్మించడంతో అక్కడి ఇళ్లు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉంది. వర్షాకాలం వస్తున్న నేపథ్యంలో స్థానికులు ఇళ్లలోకి నీరు వస్తాయని తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు.

సమస్య పరిష్కారం కాకపోగా కొత్త సమస్యలు..

మహాభారత్‌నగర్, బీజేఆర్‌నగర్ వరద నీటి ముంపు సమస్య పరిష్కారం కోసం జీహెచ్‌ఎంసీ ఇంజనీర్లు బాక్స్ డ్రైన్ నిర్మించాలని ప్రతిపాదనలు పంపగా, దాదాపు రూ.30 లక్షల నిధులు మంజూరయ్యాయి. బీజేఆర్‌నగర్ ఓపెన్ మైదానం మీదుగా లేక్ వ్యూ పార్కు కొలనులోకి వర్షపునీరు వెళ్లేందుకు పనులు చేసి లెవెల్స్ కలవడం లేదని పాత రోడ్డుపైన దాదాపు రెండున్నర అడుగుల ఎత్తులో బాక్స్ డ్రైన్ నిర్మించారు. అప్పటి నుంచి బీజేఆర్‌నగర్‌తోపాటు మహాభారత్ నగర్‌వాసులకు ముంపు సమస్య ఏమాత్రం తగ్గకపోగా కొత్త ముంపు సమస్యలు ఎదురయ్యాయి. బాక్స్ డ్రైన్ పక్క నుంచి సీసీ రోడ్డు పూర్తిగా వేయకపోవడంతో కనీసం ఆటోలు కూడా వెళ్లలేని పరిస్థితులు ఉండేవి. రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు రావడంతో అధికారులు బాక్స్ డ్రైన్ పక్కల్లో మట్టిని పోశారు. ఇక్కడ సీసీ రోడ్డు వేస్తామని సంవత్సరం దాటినా, అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ మధ్య కురిసిన వర్షానికి బీజేఆర్‌నగర్‌లోని రెండు వీధులు మునిగిపోయి ఇళ్లలోకి నీరు వచ్చాయి. వర్షాకాలంలో ఎన్ని అవస్థలు ఎదుర్కోవాల్సి వస్తుందోనని మహిళలు ఆందోళన చెందుతున్నారు. బాక్స్ డ్రైన్ వల్ల రోడ్డు కిందకు దిగడంతో మహాభారత్‌నగర్ వాంబే ఇళ్ల సముదాయాల్లో సైతం వర్షపు నీరు నిలిచిపోతుంది. ఈ విషయమై ప్రజాప్రతినిధులు కనీస మాత్రంగానైనా పట్టించుకోవడం లేదని మహిళలు ఆరోపిస్తున్నారు. సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో వెంటనే జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఇక్కడ కొత్త సీసీ రోడ్డు వేసి బస్తీలోకి వర్షపునీరు రాకుండా వీధుల్లో ఐరన్ గ్రిల్ ఛానెళ్లు ఏర్పాటు చేయాల్సిన అవసరమెంతైనా ఉన్నది.



బీజేఆర్‌నగర్‌లో సంవత్సరం క్రితం రోడ్డు మధ్య నుంచి వేసిన బాక్స్ డ్రైన్



ముంపునకు గురయ్యే బస్తీ

బాక్స్ డ్రైన్‌తో కొత్త సమస్యలు



వర్షపు నీళ్లు పోవడానికి కట్టిన బాక్స్ డ్రైన్‌తో లాభం జరగకపోగా కొత్త సమస్యలు వచ్చాయి. వర్షం వస్తే మా ఇళ్లలోకి నీళ్లు వస్తాయని భయంతో గడుపుతున్నాం. ఇంజనీర్ల ప్లాన్లు ఇట్లా ఉంటే సమస్యలు తీరేదెన్నడు. మాకు న్యాయం చేయండి.

● టి.శాంత, బీజేఆర్‌నగర్

ప్రజాప్రతినిధులు పట్టించుకోవాలి



వచ్చేది వర్షాకాలం. మొన్న చిన్న వర్షం పడితేనే రెండు గల్లీలు నీట మునిగాయి. సీసీ రోడ్డు వేస్తామని అధికారులు సంవత్సరం నుంచి చెప్తున్నా, పనులు జరుగుతలేవు. మా ఎమ్మెల్యే, కార్పొరేటర్లు ఇప్పటి కైనా స్పందించాలి. కొత్త రోడ్డు వేసి ఐరన్ గ్రిల్ ఛానెళ్లు వెంటనే పెట్టాలి.

● బి.అంజన్ కుమార్, బీజేఆర్ నగర్



యూసుఫ్‌గూడ పాఠశాలలో పనులను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

పాఠశాల సిబ్బందిపై కలెక్టర్ ఆగ్రహం

యూసుఫ్‌గూడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యూసుఫ్‌గూడ ప్రభుత్వ పాఠశాల తరగతి గదులు, ఆవరణ వ్యర్థాలతో నిండి ఉండడంతో పాఠశాల సిబ్బందిపై కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం యూసుఫ్‌గూడ ప్రభుత్వ అమ్మ అదర్శ పాఠశాలలో రూ.29 లక్షలతో జరుగుతున్న పనులను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అభివృద్ధి పనులను పాఠశాల ప్రారంభమయ్యేలోపు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌ని ఆదేశించారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ నయీముద్దీన్, ఆర్‌ఐ శ్రీకాంత్, ఎస్‌ఎల్‌ఎఫ్ అమ్మాజీ, పాఠశాల ఇన్‌చార్జి నరసింహ, ఎన్‌సీసీ అధికారి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి అవయవదానం



పార్థ సారథి

నిమ్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి తాను మరణిస్తూ అవయవదానంతో మరికొందరికి కొత్త జీవితాన్ని ప్రసాదించాడు. సంగారెడ్డి జిల్లా ఇస్మాయిల్ ఖాన్‌పేట శివాజీనగర్‌కు చెందిన గూడ పార్థసారధి(39) ప్రైవేట్ ఉద్యోగి. జూన్ 1వ తేదీన బైక్‌పై వెళ్తుండగా జిన్నారం వద్ద ప్రమాదవశాత్తు కిందపడ్డాడు. తీవ్ర గాయాలు కావడంతో కుటుంబసభ్యులు అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు ఈనెల 3వ తేదీన బ్రెయిన్ డెడ్ అయినట్టు నిర్ధారించారు. అయవయదానంపై జీవన్‌దాన్ సభ్యులు మృతుడి కుటుంబసభ్యులకు అవగాహన కల్పించారు. పార్థసారధి భార్య మమత అందుకు అంగీకరించారు. పార్థసారధి లివర్, కిడ్నీలు, కార్నియాలు సేకరించిన వైద్యులు కొందరికి అమర్చి ప్రాణదానం చేశారు. జీవన్ ప్రోగ్రాం ద్వారా 2025 జనవరి నుంచి జూన్ 4 వరకు అవయవ దానం ద్వారా బ్రెయిన్ డెడ్ అయిన వారి నుంచి 89 డొనేషన్లను స్వీకరించినట్టు జీవన్‌దాన్ నోడల్ అధికారి ప్రొఫెసర్ శ్రీభూషణ్‌రాజు తెలిపారు.

బాలాపురా బస్తీలో వృథాగా తాగునీరు



బాలాపురా బస్తీలో వృథాగా పోతున్న తాగునీరు

పట్టించుకోని సంబంధిత విభాగం అధికారులు

పంజాగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పంజాగుట్ట బాలాపురా బస్తీలో కొన్ని రోజులుగా తాగునీరు వృథాగా పోతోంది. సంబంధిత విభాగం అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. బంజారాహిల్స్ రోడ్డు నెంబర్.1 జీవీకే మాల్ పక్కన బాలాపురాబస్తీకి వెళ్లే మార్గంలో గడిచిన కొన్ని రోజులుగా పైప్‌లైన్ లీకై అక్కడ ఏర్పడిన గుంతలో నుంచి తాగునీరు వృథాగా పోతోంది. ఎత్తు ప్రాంతం నుంచి పల్లపు ప్రాంతానికి నీరు ప్రవహిస్తుడడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఒక వైపు తాగునీరు సరిగ్గా రావడం లేదని తాము బాధపడుతుంటే మరోవైపు నీరు వృథాగా పోతోందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వారు ఆరోపిస్తున్నారు. ఇటీవల తమ బస్తీకి స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్ రాగా, ఆయన దృష్టికి కూడా సమస్యను తీసుకెళ్లామని స్థానికులు చెబుతున్నారు.



యోగా ప్రదర్శన ఇస్తున్న ఎన్‌సీసీ క్యాడెట్లు

ఎన్‌సీసీ క్యాడెట్ల యోగా ప్రదర్శన

ఖైరతాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని తెలంగాణ 3వ బెటాలియన్ ఆధ్వర్యంలో 150 మంది ఎన్‌సీసీ క్యాడెట్లు గోల్కొండ కోటలో బుధవారం యోగా ప్రదర్శన ఇచ్చారు. ఎన్‌సీసీ తెలంగాణ మూడో బెటాలియన్ కమాండింగ్ అధికారి లెఫ్టినెంట్ కల్నల్ శరత్, అధికారులు లెఫ్టినెంట్ కల్నల్ ముంకాల్ శర్మ, లెఫ్టినెంట్ సంజు, లెఫ్టినెంట్ వసంత్‌కుమార్, లెఫ్టినెంట్ నరేష్‌తో పాటు క్యాడెట్లు పలు యోగాసనాలను ప్రదర్శించారు. యోగాను దినసరి అలవాటుగా మార్చుకోవాలని అధికారులు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు.

నీటి సంరక్షణ పద్ధతుల పరిశీలన

హైదరాబాద్ సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ జిల్లాలో జరుగుతున్న నీటి సంరక్షణ పద్ధతుల పర్యవేక్షణలో భాగంగా కేంద్ర ప్రభుత్వం, జలశక్తి మంత్రిత్వశాఖ నుంచి సెంట్రల్ నోడల్ ఆఫీసర్(సీఎన్ఓ) కె.కిరణ్‌రెడ్డి బుధవారం హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టిని కలిశారు. కలెక్టర్ అధికారికి పవర్ పాయింట్ సమర్పిస్తూ హైదరాబాద్ జిల్లా ఓవర్ ఎక్స్ ప్లాయిటేడ్ జిల్లాగా గుర్తించబడిందన్నారు. వాననీటి సంరక్షణకు వాటర్‌బోర్డు, జీహెచ్‌ఎంసీలు నీటి సంరక్షణ కట్టడాలు చేపట్టినట్లు తెలిపారు. జిల్లాలోని జలశక్తి కేంద్రంను సందర్శించి జరుగుతున్న పనుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వాటర్‌బోర్డు ఎండీ అశోక్‌రెడ్డి నగరంలో జరుగుతున్న పలు పనులను పవర్ పాయింట్ ద్వారా వివరించారు. సీఎన్ఓ కిరణ్‌రెడ్డి వెంట సైంటిస్ట్ డా.సుధీర్, భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె.జగన్నాథరావు, వాటర్‌బోర్డు ఓఎస్‌డీ జె.సత్యనారాయణరావు, భూగర్భ జలవనరుల శాఖ టెక్నికల్ అసిస్టెంట్ శివకుమార్ ఉన్నారు.

తక్కువ ధరలో పోషక విలువల భోజనంపై శిక్షణ

ఖైరతాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయం వారి కమ్యూనిటీ సైన్స్ కళాశాలలో ఆహారం, పోషణ విభాగం ఆధ్వర్యంలో పీఎం పోషణ(మధ్యాహ్న భోజన పథకం)నకు అనుగుణంగా పరిశుభ్రతతో కూడిన ఆరోగ్యకరమైన ఆహారం తయారీపై బుధవారం శిక్షణా కార్యక్రమం జరిగింది. పాఠశాల విద్యార్థులకు మధ్యాహ్న భోజనంలో పోషక విలువలు నష్టపోకుండా, తక్కువ ధరలో సమతుల ఆహారాన్ని తయారు చేయడం, ఆహారధాన్యాలు ఇతర సామగ్రిని ఎంచుకోవడం, జాగ్రత్తగా నిల్వ చేసుకోవడం ఇతర ఆరోగ్య సంరక్షణ పద్ధతులను నేర్పించారు. డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఈవీ నరసింహారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఆరోగ్యపరంగా ఆహార ప్రాముఖ్యతను, స్కూళ్లలో అందించాల్సిన ఆహార నాణ్యతను వివరించారు. కళాశాల అసోసియేట్ డీన్ డా.వి.విజయలక్ష్మి, ఆహారం, పోషణ విభాగాధిపతి డాక్టర్ సుచరితదేవి, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వంట సిబ్బంది, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం విగ్రహం ఏర్పాటుపై హర్షం

పంజాగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గాన గంధర్వుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి, తన గాన మాధుర్యంతో తెలుగు జాతి కీర్తిని ప్రపంచానికి చాటిన దివంగత ఎస్పీ బాలసుబ్రమణ్యం విగ్రహాన్ని త్వరలోనే రవీంద్రభారతి ఆవరణలో ప్రతిష్టించేందుకు రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ది మ్యూజిక్(కల్చరల్ అసోసియేషన్) హర్షం వ్యక్తం చేసింది. బుధవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత రామరాజు ప్రధాన కార్యదర్శి బి.ఎస్.కృష్ణమూర్తి సభ్యులతో కలిసి మాట్లాడారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమానులు దక్షిణాదిలో ఆయన విగ్రహాలను ప్రతిష్టించగా, ఆయన ఎక్కువ కాలం ఉన్న హైదరాబాద్‌లో విగ్రహం లేకపోవడం ఒక లోటుగా ఉండేదని అన్నారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు సురేఖ, ధర్మతేజ,స్వామి ఆలూరి తదితరులు పాల్గొన్నారు.

క్రెడిట్ కార్డు రివార్డు పాయింట్ల పేరుతో మోసం

● రూ. 1..23 లక్షలు కొల్లగొట్టిన సైబర్ క్రిమినల్స్

హైదరాబాద్ సిటీ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు రివార్డు పాయింట్లను నగదు రూపంలో యాడ్ చేస్తానని బురిడీ కొట్టించిన సైబర్ క్రిమినల్స్. మోసపూరిత ఏపీకే లింక్ పంపి నగరానికి చెందిన వ్యాపారిని మోసం చేశారు. క్రెడిట్ కార్డులో ఉన్న రూ.1.23 లక్షలు కొట్టేశారు. మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళ్తే.. నగరానికి చెందిన 35 ఏళ్ల వ్యాపారికి వాట్సాప్ కాల్ చేసిన గుర్తుతెలియని వ్యక్తి ఇండస్ ఇండ్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌గా పరిచయం చేసుకున్నాడు. బాధితుడికి మీ క్రెడిట్ కార్డులో రివార్డు పాయింట్లు జమ అయినట్లు నమ్మించారు. ఆ రివార్డు పాయింట్లను నగదుగా మార్చుకునేందుకు అవకాశం ఇస్తామని మీకు పంపిన లింక్‌ను ఓపెన్ చేస్తే ప్రాసెస్ చేస్తానని నమ్మించాడు. అయితే, బాధితుడిది ఆపిల్ ఫోన్ కావడంతో లింక్ ఓపెన్ కాలేదు. దాంతో ఆ సిమ్ తీసి, వేరే ఫోన్‌లో వేసి ఓపెన్ చేయాలని నిందితుడు సూచించాడు. అతడి మాటలు నమ్మిన బాధితుడు అలాగే చేశాడు. ఆ తర్వాత నిందితుడు చెప్పిన విధంగా లింక్ ఓపెన్ చేసి క్రెడిట్ కార్డు డిటేయిల్స్ ఎంటర్ చేసి సబ్‌మిట్ చేయడంతో రివార్డు పాయింట్స్ యాడ్ కాకపోగా.. అతడి ఖాతాలో ఉన్న రూ. 1.23 లక్షలు డెబిట్ అయ్యాయి. దాంతో మోసపోయినట్లు ఆలస్యంగా గుర్తించిన బాధితుడు సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



వరల్డ్ పోలీస్ సమ్మిట్‌లో యాంటీ నార్కోటిక్ విభాగంలో ప్రపంచంలోనే మొదటి స్థానంలో నిలిచి ఎక్సలెన్స్ ఆఫ్ యాంటీ నార్కోటిక్ అవార్డు సాధించి రికార్డు సృష్టించారు హైదరాబాద్ సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్. ఐసీసీసీలో బుధవారం ఆయనను ఘనంగా సన్మానించిన హైదరాబాద్ సిటీ సెక్యూరిటీ కౌన్సిల్ జనరల్ సెక్రటరీ శేఖర్‌రెడ్డి, ప్రతినిధులు

సర్దార్ కుటుంబానికి న్యాయం చేస్తాం

● కూకట్‌పల్లి ఎమ్మెల్యే కృష్ణారావు

బోరబండ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ బోరబండ డివిజన్ మైనార్టీ విభాగం అధ్యక్షుడు సర్దార్ కుటుంబానికి న్యాయం చేస్తామని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు తెలిపారు. బోరబండ ఎస్ ఆర్‌టినగర్‌లోని సర్దార్ నివాసానికి బుధవారం వచ్చిన ఎమ్మెల్యే అతడి కుటుంబసభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పాలనలో పేదలపై దౌర్జన్యాలు పెరిగిపోయాయని విమర్శించారు. బోరబండ కార్పొరేటర్ బాబా ఫసియుద్దీన్ విషయంలో టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ ఆలోచించాలని కోరారు. టౌన్‌ప్లానింగ్ అధికారులు కూడా పెద్దల జోలికి వెళ్లకుండా, వంద గజాలలోపు ఇల్లు కట్టుకుంటున్న వారిని వేధిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల జోలికి వెళితే ఊరుకునేది లేదని హెచ్చరించారు. టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్‌తో చర్చించి సర్దార్ కుటుంబాన్ని ఆదుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మేడ్చల్ జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు ఎం.డి.గౌసుద్దీన్, సత్యం, ఐలయ్య, వీరారెడ్డి, అబ్దుల్ రహీమ్, హమీద్, రఫీక్, కాంగ్రెస్ నాయకులు ఎం.డి.ఖదీర్, ఎం.డి.గౌస్, నరసింహగౌడ్, బీఆర్ఎస్ బోరబండ అధ్యక్షుడు టి.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



సర్దార్ కుటుంబసభ్యులను పరామర్శిస్తున్న కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

రాజకీయాల్లో కీలకంగా సర్వేలు

బంజారాహిల్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాజకీయాలపై పలు సంస్థలు చేస్తున్న సర్వేలు కీలకంగా మారుతున్నాయని, అవి ఎంతో సమాచారాన్ని ఆయా పార్టీలకి అందజేస్తున్నాయని కేకే సర్వే అధినేత కిరణ్ కొండేటి అన్నారు. బుధవారం మాదాపూర్‌లో ఆయన పారా వీల్ పేరుతో ఏర్పాటుచేసిన మొబైల్ అప్లికేషన్‌ను ప్రఖ్యాత వ్యాఖ్యాత సుమ కనకాలతో కలిసి ఆవిష్కరించారు. ప్రస్తుతం రాజకీయాల్లో ఉన్నవారితో పాటు రాజకీయాల్లో రాణించాలనుకునే వారికి తాము తీసుకొచ్చిన ఈ పారా వీల్ అనే అప్లికేషన్ ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. ప్రస్తుతం తాము ఆంధ్రప్రదేశ్‌లోని 175 నియోజకవర్గాల సమగ్ర సమాచారాన్ని ఈ అప్లికేషన్లో ఉంచామని, ఇది రాజకీయాల్లో రాణించాలనుకునే వారికి ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. ఒక్కో నియోజకవర్గంపై 36 అంశాలు 100 పేజీలకు తగ్గకుండా సమాచారాన్ని అందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు ప్రవీణ్, సాయి, తిరుమలేష్, గంగాధర్, యోగేశ్వర్‌రెడ్డి, సాంబశివ, సుశాంత్ పాల్గొన్నారు.

బీజేపీ అమీర్‌పేట డివిజన్ నూతన కార్యవర్గం

అమీర్‌పేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బీజేపీ అమీర్‌పేట డివిజన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. 45 మందితో కార్యవర్గాన్ని అధిష్ఠానం బుధవారం ప్రకటించింది. డివిజన్ అధ్యక్షుడు అనంతుల రమేష్ స్థానిక కార్పొరేటర్ కేతినేని సరళ, ఈఎస్ఐసీ ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు శ్రీశైలంగౌడ్‌తో కలిసి స్థానిక పార్టీ కార్యాలయంలో కమిటీ వివరాలను వెల్లడించారు. డివిజన్ పార్టీ ఉపాధ్యక్షులుగా కె.రమేష్‌గౌడ్, సిద్ధి రాములు ముదిరాజ్, ప్రమీలబాయ్, పి.సౌజన్య ముదిరాజ్, ప్రధాన కార్యదర్శులుగా చందు ముదిరాజ్, రజితరెడ్డి, కార్యదర్శులుగా ఎ.అమరేందర్‌గౌడ్, డి.మాలతిగౌడ్, సీహెచ్ శిరీషా, రితేష్ రాథోడ్, వేణు ముదిరాజ్‌తో పాటు మరో 34 మంది కార్యవర్గ సభ్యులు ఎంపికైనట్లు తెలిపారు. నూతన డివిజన్ కమిటీ నాయకులు నిరంతరం పార్టీ బలోపేతం కోసం పనిచేయాలని బీజేపీ మాజీ జిల్లా అధ్యక్షుడు బూర్గుల శ్యామ్‌సుందర్‌గౌడ్ పిలుపునిచ్చారు. తమకు డివిజన్ కమిటీలో చోటు కల్పించేందుకు కృషి చేసిన శ్యామ్‌సుందర్‌గౌడ్, కేతినేని సరళకు నూతన డివిజన్ కమిటీ కార్యవర్గం కృతజ్ఞతలు తెలిపారు.



డివిజన్ కమిటీ వివరాలను వెల్లడిస్తున్న రమేష్



ధర్మకర్తలను అభినందిస్తున్న కోట నీలిమ

ధర్మకర్తలు దైవభక్తితో పనిచేయాలి

అమీర్‌పేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బాపునగర్‌లోని శ్రీ వీరాంజనేయ శ్రీ వేంకటేశ్వర శ్రీ సాయిబాబా ఆలయం, ఎస్ఆర్‌నగర్‌లోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాల నూతన ధర్మకర్తలు దర్శనం కోసం ఆలయాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా దైవభక్తితో పనిచేయాలని కాంగ్రెస్ పార్టీ సనత్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కోట నీలిమ సూచించారు. బుధవారం ధర్మకర్తలు సనత్‌నగర్‌లో కోట నీలిమను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుదీర్ఘకాలం తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పనిచేసే వారికి తగిన గుర్తింపు ఇస్తుందన్నారు. కార్యక్రమంలో ధర్మకర్తలు వెంకటరాఘవేంద్రరావు, రమేష్, గోవర్ధన్, పద్మావతిగౌడ్, నాగమణి, అనిల్ కుమార్‌గౌడ్, ప్రేమ్‌కుమార్, డివిజన్ అధ్యక్షులు శ్రీనివాసరావు, మిరియాల నవీన్‌రాజు పాల్గొన్నారు.

మ్యూజిక్ రంగంలో అపార అవకాశాలు

పంజాగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మనసుకు ఉల్లాసాన్ని నింపే మ్యూజిక్ రంగంలో అవకాశాలు కూడా అపారంగా ఉంటాయని ప్రముఖ సినీనటుడు నవదీప్ అన్నారు. పంజాగుట్టలో ఔత్సాహిక మ్యూజిక్ ట్రైనర్స్ దీపక్, విశ్వజిత్, త్రిలోక్ చందర్ ఏర్పాటు చేసిన బీట్ కోడ్ మ్యూజిక్ అకాడమిని నటుడు వంశీ చాగంటితో కలిసి ఆయన ప్రారంభించారు. స్వల్పకాలిక కోర్సులతో పాటు ఏడాది పాటు కొనసాగే డిప్లమా కోర్సును ఇక్కడ అందిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. సినీరంగంతోపాటు ఉన్నత స్థాయిలో జరిగే మ్యూజిక్ కార్యక్రమాల్లో పాల్గొనేలా శిక్షణ ఇస్తున్నట్లు వారు చెప్పారు.





రాజ్‌భవన్ రోడ్డులో నాటిన మొక్కలు

రాజ్‌భవన్ రహదారిలో అందమైన మొక్కలు

● పచ్చదనంతోపాటు సుందరీకరణ

ఖైరతాబాద్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పచ్చదనాన్ని పెంచడంతో పాటు వీఐపీ రహదారిని సుందరంగా తీర్చిదిద్దే పనుల్లో భాగంగా రాజ్‌భవన్ రహదారిలో అందమైన మొక్కలను నాటారు. రోడ్డు మధ్యన డివైడర్‌తో పాటు పలు ప్రాంతాల్లో సెంటర్ మిరీడియన్లను పెంచుతూ లాన్‌లను ఏర్పాటు చేశారు. రూ.20 లక్షలతో ఎన్నో రకాల పూల మొక్కలతో పాటు అందంగా కనిపించే రకరకాల మొక్కలను రాజ్‌భవన్ రహదారిలో ఏర్పాటు చేసినట్లు జీహెచ్‌ఎంసీ అర్బన్ ఫారెస్ట్ విభాగం అధికారులు తెలిపారు. వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఈ మొక్కల ఏర్పాటు కోసం మొదట రాజ్‌భవన్ రహదారిని ఎంచుకొని ప్రయోగాత్మకంగా చేపట్టామని వారు తెలిపారు.

నలుగురు అదృశ్యం

యూసుఫ్‌గూడ, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు ప్రాంతాలకు చెందిన నలుగురు అదృశ్యమయ్యారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్‌కు చెందిన బాలిక ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లింది. తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. అలాగే, రహ్మత్‌నగర్‌కు చెందిన కారె చరణ్ ఇంట్లో చెప్పకుండా బయటకు వెళ్లిపోయాడు. తల్లి రమాదేవి పోలీసులకు ఫిర్యాదు చేసింది.

తల్లీకొడుకు..

రహ్మత్‌నగర్‌కు చెందిన రాజేశ్వరి రెండు సంవత్సరాల కొడుకు దేవాన్ష్‌ను తీసుకొని భర్త డ్యూటీకి వెళ్లిన సమయంలో ఇంటి నుంచి వెళ్లిపోయింది. భర్త సింగం బాలకృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



ఎన్నికలు నిర్వహించకపోవడంతో పరిష్కారం కాని సమస్యలు: శ్రీగణేష్

సికింద్రాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు పాలకమండలికి సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడం వలన చిన్నపాటి సమస్యలు కూడా పరిష్కారానికి నోచుకోవడం లేదని కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్ అన్నారు. కంటోన్మెంట్ 5వ వార్డు జ్యోతి కాలనీలో బుధవారం డ్రైనేజీ పైప్‌లైన్ నిర్మాణ పనుల శంకుస్థాపన కార్యక్రమానికి ఎంపీ ఈటల రాజేందర్‌తో కలిసి ఆయన హాజరయ్యారు. శంకుస్థాపన అనంతరం ఓ మహిళ వచ్చి స్థానికంగా తాము పలు సమస్యలతో సతమతమవుతున్నామని ఆవేదన వ్యక్తం చేయగా వారు నివసిస్తున్న ప్రాంతానికి ఆయన వెళ్లారు. దాంతో స్థానికులు తమ సమస్యలు మొర పెట్టుకున్నారు. దీనికి శ్రీగణేష్ సానుకూలంగా స్పందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఐదేళ్లుగా కంటోన్మెంట్ బోర్డు ఎన్నికలు నిర్వహించకపోవడంతో ఇలాంటి సమస్యలు కూడా పరిష్కారం కావడం లేదని అన్నారు. స్థానికంగా గతంలో బోర్డుకు ఎన్నికైన వారు, నామినేటెడ్ సభ్యునిగా పదవులు నిర్వహించిన వారు పట్టించుకోకపోవడంతో సమస్యలన్నీ అపరిష్కృతంగా ఉన్నాయని విమర్శించారు.

ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు

తిరుమలగిరి జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యేగా శ్రీగణేష్ ఏడాది పూర్తిచేసుకున్న సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు నాగనేని సరిత పికెట్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపి, శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. కంటోన్మెంట్ అభివృద్ధికి మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో మహేష్, అన్ను, సందీప్, నీరజ్ తదితరులు ఉన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రంగా రవీంతర్ గుప్తా కంటోన్మెంటు ఎమ్మెల్యే శ్రీగణేష్‌ను శుభాకాంక్షలు తెలియజేశారు.

సికింద్రాబాద్‌లో..

ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీగణేష్‌ను బుధవారం పీసీసీ కార్యదర్శి ఎస్.రాజేష్‌యాదవ్ సత్కరించారు. మహేష్, అన్నానగర్ మురళి, అస్గర్, వినోద్ పాల్గొన్నారు.



అయ్యప్ప దేవాలయం భూమిపూజ కార్యక్రమంలో పాల్గొన్న జంపన ప్రతాప్

దేవాలయ నిర్మాణానికి భూమిపూజ

బోయినపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : బోయినపల్లిలోని రాయల్ ఎన్‌క్లేవ్‌లోని అయ్యప్ప తీర్థక్షేత్రంలో బీజేపీ రాష్ట్ర సెక్రటరీ, కపిల్ బారాబరీ ఆధ్వర్యంలో బుధవారం ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపన ప్రతాప్, పట్టణ ప్రముఖులు, వివిధ పార్టీల నాయకుల సమక్షంలో వేద పండితులు కేరళ శ్రీకేష్ సబారినాద్ నేతృత్వంలో ఆలయంలో గణపతి హోమం, సుదర్శన హోమంతో పాటు, వాస్తు పూజలను భూమి పూజ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జంపన ప్రతాప్ మాట్లాడుతూ ఆలయాల నిర్మాణంతోనే ఆధ్యాత్మిక భక్తిభావం పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ వినోద్ కుమార్, భాను ప్రసాద్, సంజయ్ బండారి, వెంకట్ రాములు, గురుస్వామి, బుచ్చిరెడ్డి, ధర్మేవా గురుస్వామి, మెడికల్ శ్రీనివాస్ గురుస్వామి, జె.గౌడ్ గురుస్వామి, వివిధ పార్టీల నాయకులు శివనారాయన అయ్యప్పన్ తదితరులు పాల్గొన్నారు.



బోయినపల్లి పుల్లారెడ్డి బంగ్లా దారిలో ప్రమాదకరంగా ఉన్న మ్యాన్‌హోల్

కుంగిన మ్యాన్‌హోల్స్.. తప్పని ఇక్కట్లు

బోయినపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ బోర్డు 6వ వార్డు పరిధిలోని బోయినపల్లి పుల్లారెడ్డి బంగ్లా ముందు ఉన్న ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్స్ కుంగిపోయాయి. అంతేకాకుండా దాదాపు 100 మీటర్ల దూరంలో ఉన్న నాలుగు మ్యాన్‌హోళ్లు కుంగిపోవడంతో వాహనాల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. దీంతో సీతారాపురం, భవానినగర్, గణేష్‌నగర్, సాయిబాబా కాలనీలతో పాటు, వాణి కాన్వెంట్, సీఎంఆర్ స్కూల్, సెయింట్ పీటర్స్ పాఠశాలలకు రాకపోకలు సాగించేవారూ పాట్లు పడుతున్నారు. రాత్రి సమయాల్లో వీటిని గమనించని వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి కొత్త మ్యాన్‌హోల్స్ ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని వృద్ధుడి మృతి



సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రైలు ఢీకొని గుర్తుతెలియని ఓ వృద్ధుడు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటన ఘట్‌కేసర్ సమీపంలో జరిగింది. సికింద్రాబాద్ రైల్వే హెడ్ కానిస్టేబుల్ డేవిడ్‌రాజు తెలిపిన వివరాల ప్రకారం ఘట్‌కేసర్ - బీబీనగర్ రైల్వేస్టేషన్ సమీపంలో రైలు పట్టాల పక్కన గుర్తు తెలియని 50 ఏళ్ల వృద్ధుడు చనిపోయి ఉండడంతో సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటన స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడు రైలు నుంచి జారిపడి చనిపోయాడా, లేదంటే రైలు పట్టాల వెంట నడుచుకుంటూ వస్తుండగా రైలు ఢీకొని చనిపోయాడా అన్న కోణంలో రైల్వే పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలే కీలకం

- పట్టించుకోని ప్రజానీకం
- సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్న పోలీసు యంత్రాంగం



మంజు థియేటర్ వీధిలో ఉన్న సీసీ కెమెరా

సికింద్రాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఇటీవల సికింద్రాబాద్‌లోని మంజు థియేటర్ వీధిలో గుర్తు తెలియని వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. ఓ ఫర్నిచర్ దుకాణం షట్టర్ ముందు మృతదేహం ఉండగా స్థానికులు చూసి మహంకాళి పోలీసులకు సమాచారం అందించారు. దాంతో పోలీసు ఉన్నతాధికారులు, సిబ్బంది హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. తలపై తీవ్ర గాయాలు ఉండడంతో ఎవరో హత్య చేసినట్టు పోలీసులు భావించారు. హత్య చేసిన వారి గురించి తెలుసుకునేందుకు పరిసరాల్లో సీసీ కెమెరాలు ఉన్నాయేమోనని పరిశీలించారు. ఘటన స్థలంలోని ఫర్నిచర్ దుకాణం, పక్కనే ఉన్న టిఫిన్ సెంటర్, ఎదురుగా ఉన్న చెట్టుకు సీసీ కెమెరా ఉండడంతో కేసు దర్యాప్తుకు సహకరిస్తాయని ఆశపడ్డారు. తొలుత ఫర్నిచర్ యజమానికి ఫోన్ చేశారు. హత్య గురించి చెప్పి, సీసీ ఫుటేజీ చూపించాలని కోరగా అయితే తమ దుకాణంలోని కెమెరాలు పని చేయడం లేదని యజమాని చల్లగా చెప్పాడు. పక్కన ఉన్న టిఫిన్ సెంటర్ యజమానితో మాట్లాడితే.. టిఫిన్ సెంటర్ లోపల జరిగే కార్యకలాపాలపై నిఘా వేయడానికి ఆ సీసీ కెమెరాను ఏర్పాటు చేసినట్టు చెప్పాడు.



దాంతో ఎదురుగా ఉన్న సీసీ కెమెరాను పరిశీలిస్తే అది చాలా కాలంగా పని చేయడం లేదని తేలింది. సమీపంలోని మద్యం దుకాణం వద్ద సీసీ కెమెరా ఉన్నదని తెలిసి ఆ కెమెరా ఫుటేజీ సహకారంతో కేసు దర్యాప్తు మొదలు పెట్టారు. అటు హతుడు, ఇటు నిందితుడు ఇద్దరూ మద్యం దుకాణం వద్ద నుంచి ఘటన జరిగిన స్థలానికి వచ్చినట్టు ఫుటేజీ ద్వారా నిర్ధారించుకున్నారు. ఫర్నిచర్ దుకాణం వద్ద నిద్రిస్తున్న వ్యక్తిని రెండో వ్యక్తి తలపై బండరాయితో మోది అంతమొందించినట్టు తెలుసుకున్నారు. మొత్తానికి హత్య కేసు చిక్కు ముడివీడింది. చాలా తక్కువ కాలంలోనే ఈ హత్య కేసు చిక్కు ముడిని పోలీసులు విప్పగలగడానికి సీసీ కెమెరా కీలకంగా మారింది.

- అందుకే వ్యాపార, వర్తక, వాణిజ్య కేంద్రాలు, దుకాణాలు, సినిమా థియేటర్లు, హోటళ్లతోపాటు కాలనీలు, బస్తీల్లో సైతం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలంటూ పోలీసుశాఖ పదే పదే చెబుతోంది. ఇవి ఉండటం వల్ల నేరాల శాతం తగ్గే అవకాశాలు ఉన్నాయని అధికారులు పేర్కొంటున్నారు. వ్యాపారులు, కాలనీవాసులు, బస్తీవాసులకు సీసీ కెమెరాల వల్ల కలిగే ప్రయోజనాల గురించి అవగాహన కల్పిస్తూ, విరివిగా ఏర్పాటు చేసేలా యత్నిస్తున్నారు. పోలీసులు అవగాహన కల్పించగానే ఆయా వర్గాల నుంచి సానుకూల స్పందన వస్తోంది. అయితే కొద్ది రోజుల తర్వాత సాంకేతిక సమస్యలు తలెత్తి, అవి మూలన పడితే పట్టించుకోవడం లేదు. అలాగే కొందరు వ్యాపారులు తమ సంస్థల పని వేళలు ముగిసిన తర్వాత కెమెరాల డిస్‌ప్లేను ఆపివేస్తున్నారు. దాంతో ఆ రాత్రి నుంచి మరుసటి రోజు మరలా కెమెరాల డిస్‌ప్లే ఆన్ చేసే వరకు ఏం జరిగిందో తెలియని పరిస్థితి నెలకొంటోంది. మరి కొందరైతే అవగాహన కల్పించినా వీటి ఏర్పాటుకు ముందుకు రావడం లేదు. ప్రజల నుంచి పూర్తి స్థాయిలో సహకారం వస్తే సత్ఫలితాలు వస్తాయని పోలీసులు పేర్కొంటున్నారు.

స్పందన అంతంత మాత్రమే

మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు చాలా కాలంగా పోలీసు శాఖ కసరత్తు చేస్తోంది. బంగారు, వెండి, వస్త్ర దుకాణాలు అధిక శాతం ఉన్న ఈ ఏరియాలో వీటి ఏర్పాటు విషయమై అవగాహన శిబిరాలు నిర్వహించింది. అయినా ఆశించిన స్థాయిలో స్పందన రాకపోవడం ఆందోళన కలిగిస్తోంది. మహంకాళి పోలీస్ స్టేషన్ పరిధిలో పోలీసు శాఖ 19 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా.. అవన్నీ పని చేస్తున్నాయి. నేను సైతం కింద 12,500 కెమెరాలు ఏర్పాటు చేయగా, 10,200 పని చేస్తున్నాయి. కమ్యూనిటీ కెమెరాలు 126 ఏర్పాటు చేయగా 45 మాత్రమే పని చేస్తున్నాయి. నేరాల నియంత్రణలో కీలకమైన సిసి కెమెరాల ఏర్పాటుకు ఇప్పటికైనా ముందుకు రావాలని పోలీసులు కోరుతున్నారు.

విస్తృతంగా అవగాహన



నేరాలు జరగకుండా నిరోధించడానికి పోలీసు యంత్రాంగం కృషి చేస్తోంది. అయితే పౌరులు కూడా పోలీసుశాఖకు పూర్తి సహకారం అందించాలని విజ్ఞప్తి చేస్తున్నాం. నేరాల నియంత్రణ, కేసుల పరిష్కారంలో కీలకమైన సీసీ కెమెరాల ఏర్పాటుపై విస్తృతంగా అవగాహన కల్పిస్తున్నాం. ప్రజల నుంచి మరింత స్పందన రావలసి ఉంది. వ్యాపారులు తప్పనిసరిగా కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. దుకాణదారులు సీసీ కెమెరాలను బయట కూడా ఏర్పాటు చేయాలి. దుకాణం మూసివేసిన తర్వాత కూడా కెమెరాల్లో రికార్డు జరిగేలా చూడాలి. సాంకేతిక సమస్యలు తలెత్తితే, వెంటనే పరిష్కరించి, సక్రమంగా పని చేసేలా చూడాలి. ఎక్కువ రోజులు ఫుటేజీ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలని కోరుతున్నాం.

- మహంకాళి ఇన్‌స్పెక్టర్ పరశురామ్

ముగిసిన స్కౌట్ మాస్టర్ల బేసిక్, అడ్వాన్స్ శిక్షణ



శిక్షణలో పాల్గొన్న స్కౌట్ మాస్టర్లు



సర్వమత ప్రార్థనలో స్కౌట్ మాస్టర్లు

రాంగోపాల్‌పేట్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బేసిక్, అడ్వాన్స్ కోర్సుల్లో శిక్షణ పొందిన స్కౌట్ మాస్టర్లు విద్యార్థులను ఉత్తమ భావి భారత పౌరులుగా తయారు చేయాలని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ రాష్ట్ర ట్రైనింగ్ కమిషనర్(ఎస్టీసీ) ఎం.మోహన్‌రావు ఆకాంక్షించారు. బుధవారం సికింద్రాబాద్ సర్దార్ పటేల్ రోడ్డులోని భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా కార్యాలయంలో ఏడురోజులు పాటు జరిగిన స్కౌట్ మాస్టర్ల బేసిక్, అడ్వాన్స్ శిక్షణ శిబిరం బుధవారంతో ముగిసింది. ఈ శిబిరంలో సికింద్రాబాద్, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్, పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల నుంచి మొత్తం 34మంది పాల్గొన్నారు. ఈ శిబిరంలో ప్రథమ చికిత్స, వంట, పాయినీరింగ్, సిగ్నల్స్ ఉడ్ క్రాఫ్ట్ సైన్స్‌లతో పాటు స్కౌటింగ్‌లోని పలు అంశాలను మాస్టర్లు నేర్చుకున్నారు. చివరి రోజు ఉదయం సర్వమత ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా లీడర్ ఆఫ్ ది కోర్సు అడ్వాన్స్ ఎస్టీసీ మోహన్‌రావు మాట్లాడుతూ ఈ సెలవు రోజుల్లో ఉపాధ్యాయులు వారంరోజులు పాటు తమ కుటుంబాన్ని వదిలి ఈ శిక్షణకు రావటం అభినందనీయమన్నారు. లీడర్ ఆఫ్ ది కోర్సు బేసిక్‌కోర్సు, సికింద్రాబాద్ జిల్లా కార్యదర్శి రమేష్ చందర్ మాట్లాడుతూ విద్యార్థులను అన్ని రంగాల్లో నిష్ణాతులుగా తీర్చిదిద్దేందుకు స్కౌట్ ఉద్యమం ఉపయుక్తమైనదని, బేసిక్‌కోర్సులో శిక్షణ పొందిన మాస్టర్లకు అభినందనలు తెలిపారు. ఈ శిబిరంలో అసిస్టెంట్ లీడర్ ట్రైనర్ రవికుమార్ చారి, హిమాలయ ఉడ్ బ్యాడ్జ్ హోల్డర్లు సల్మాన్, గౌరీనాథ్, విష్ణుప్రసాద్, రాజశేఖర్‌రెడ్డి, రమేష్‌లాల్, అడ్వాన్స్ స్కౌట్ మాస్టర్ మల్లేశ్ ఈ శిబిరంలో సహకారాన్ని అందించారు.



ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న బాలల హక్కుల పరిరక్షణ వేదిక బృందం

విద్యా ప్రమాణాలను మెరుగుపర్చాలని వినతి

అడ్డగుట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో దిగజారిన విద్యా ప్రమాణాలను మెరుగు పరచాలని కోరుతూ బాలల హక్కుల పరిరక్షణ వేదిక బృందం బుధవారం ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డికి వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా అడ్డగుట్టలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వేణుగోపాల్ మాట్లాడుతూ బీజేపీ భరోసా కార్యక్రమంలో భాగంగానే ఎమ్మెల్యేకు వినతిపత్రం సమర్పించామని తెలిపారు. ఈ ప్రభుత్వం నాణ్యమైన విద్యను అందించే విదంగా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యేను కోరామన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో బాలల హక్కుల పరిరక్షణ వేదిక రాష్ట్ర కన్వీనర్ వేణుగోపాల్, కో-కన్వీనర్ పెండెం లక్ష్మణ్, జిల్లా కార్యదర్శి లక్ష్మినారాయణ, తల్లుల సంఘం కో-కన్వీనర్ దశరథలక్ష్మిలు ఉన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా విద్యార్థులను తీర్చిదిద్దాలి

- వాటిలో రీడింగ్, రైటింగ్ స్కిల్స్ పెంచాలి
- శిథిలావస్థలో ఉన్న పాఠశాల భవనాలను సత్వరమే తొలగించాలి
- మేకలమండి పాఠశాల నిర్మాణాన్ని పర్యవేక్షించిన కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి



ప్రభుత్వ పాఠశాలను పరిశీలిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

హైదరాబాద్ సిటీ, పద్మారావునగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ మేకలమండి ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయి పాఠశాల స్థాయిలో నిర్మించడంతో పాటు పిల్లల సంఖ్య పెంచాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ఉపాధ్యాయులను ఆదేశించారు. బుధవారం పలు ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. తొలుత నాంపల్లిలోని ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలను, సికింద్రాబాద్ కృష్ణానగర్‌లోని మేకలమండి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను, యూసుఫ్‌గూడ ప్రాథమికోన్నత పాఠశాల, బోరబండ ప్రభుత్వబాలుర హై స్కూల్‌ను పరిశీలించి చేపడుతున్న పనులు వేగవంతం చేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. కలెక్టర్ మాట్లాడుతూ మేకలమండిలో నిర్మించిన ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల నిర్మాణం బాగుందని కాంట్రాక్టర్ కృష్ణారెడ్డిని అభినందించారు. ఈ ప్రాంతంలో కార్పొరేట్ స్థాయికి తగ్గట్టుగా ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయడంతో విద్యార్థుల సంఖ్య వెయ్యికి పెంచాలని ఆదర్శ పాఠశాల కమిటీ ఛైర్మన్, ఉపాధ్యాయులను ఆదేశించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల సంఖ్య , ఖాళీల వివరాలు, నీటి వసతులు అడిగి తెలుసుకన్నారు. ఎనిమిదో తరతగతి పుస్తకాలను త్వరలో అందిస్తామని, పాఠశాల గోడలపై విద్య ఆవశ్యకత గురించి ఇంగ్లీషులో స్లోగన్స్ రాయించాలని హెచ్‌ఎంను ఆదేశించారు. పాఠశాల హెచ్‌ఎం వాల్ పెయింటింగ్స్ కాంపౌండ్ వాల్‌కు ఐరన్ ఫ్రేమ్‌ఏర్పాటు చేయాలని కలెక్టర్ విజ్ఞప్తి చేయగా సత్వరమే పనులు చేపట్టాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. నాంపల్లిలోని ప్రభుత్వ మోడల్ ప్రాథమిక పాఠశాలను పరిశీలించి అదే ఆవరణలో గల మూడు పాత భవనాలను కమిటీ నిర్ణయం తర్వాత తొలగించాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వర్షపునీరు బయటికి వెళ్లే సౌకర్యం లేకపోవడంతో డ్రైనేజ్ ఏర్పాటు చేయాలని, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీతో తరగతి గదుల్లో చేపట్టిన మరమ్మతు పనులు, ఎలక్ట్రికల్ వర్క్స్, మరుగుదొడ్ల మరమ్మతులు, తాగునీరు ఏర్పాటు చేసి, పాఠశాల ఆవరణలో స్టేజి నిర్మాణం పనులు పరిశీలించి మిలిలి ఉన్న పనులు సత్వరమే చేపట్టాలని బడిబాట కార్యక్రమంలో పిల్లల సంఖ్య 250 మందికి పెంచాలని ఆదేశించారు. యూసుఫ్‌గూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఉన్న పనులు సత్వరమే చేపట్టాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. బోరబండ ప్రభుత్వ బాలుర ప్రాథమికోన్నత పాఠశాలలో తొలగించిన పాత భవనస్థలాన్ని పరిశీలించి నూతన భవన నిర్మాణానికి చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ షఫీ మియా, డీఈ అశీర్వాదం, తాహసీల్దారులు ప్రేమ్‌కుమార్, నయీముద్దీన్, పాండు నాయక్, ప్రధానోపాధ్యాయులు రజిని, స్వరూప, గీత, ఎస్‌ఎల్‌ఎఫ్ భవిత, ఉపాధ్యాయులు, మదర్స్ కమిటీసభ్యులు పాల్గొన్నారు.

ఇద్దరు నగల దొంగల అరెస్టు

- ఆన్‌లైన్ స్నేహితులు - రైళ్లలో దొంగతనాలు
- జైలుకు వెళ్లినా ఇదే తంతు



నగల దొంగల్ని అరెస్టు చూపుతున్న రైల్వే పోలీసులు

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) : రైళ్లలో నగల దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు పాత నేరస్తులను సికింద్రాబాద్ రైల్వే పోలీసులు అరెస్టు చేసి రూ.11.46 లక్షల విలువ చేసే బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్ని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సికింద్రాబాద్ రైల్వే డీఎస్పీ జావీద్, ఇన్‌స్పెక్టర్ సాయి ఈశ్వర్‌గౌడ్‌లు తెలిపిన వివరాల ప్రకారం కొత్తగూడెం భద్రాది అనిశెట్టిపల్లి ప్రాంతానికి చెందిన తంబల్ల నితిన్(27), నిజామాబాద్‌కు చెందిన ఇంద్రల్ల రాజేష్(27) ఇద్దరు ఆన్‌లైన్ పరిచయంతో స్నేహితులుగా మారారు. సులువుగా డబ్బు సంపాదించేందుకు రైళ్లలో ప్రయాణికుల నుంచి బంగారు నగలను దోచుకునేవారు. తంబల్ల నితిన్ 23 సార్లు చోరీలకు పాల్పడి జైలు నుంచి ఇటీవలె బెయిల్‌పై బయటికి వచ్చాడు. రాజేష్ 16 చోరీ కేసుల్లో నిందితుడు. ఇద్దరూ కలిసి బుధవారం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాం నంబరు-1లో అనుమానాస్పదంగా తిరుగుతుండగా తనిఖీలు చేస్తున్న ఎస్సై మాజీద్, రమేష్‌తో పాటు కానిస్టేబుళ్లు సుఖ్‌దేవ్, హరిలాల్, భవాని శంకర్‌లు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారించగా రైళ్లలో నగల చోరీలకు పాల్పడుతున్నట్లు విచారణలో తేలింది. ఈ క్రమంలో ఇద్దరు నిందితుల నుంచి రూ.11.46 లక్షల విలువ చేసే 114.6 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు.

'యువతకు పద్య నాటకాలపై ఆసక్తిని పెంచాలి'

చిక్కడపల్లి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): యువతకు పద్యనాటకాల పట్ల ఆసక్తిని పెంచాలని కిన్నెర ఆర్ట్స్ అధినేత మద్దాళి రఘురామ్ అన్నారు. ఆరాధన సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయ గానసభలో దుర్యోధన మాయసభ- శయనదృశ్యం పద్యనాటక ప్రదర్శన జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొని, నటులను సన్మానించిన రఘురామ్ మాట్లాడారు. మన సంస్కృతిని, సంప్రదాయాలను తెలియజేసే పద్యనాటకాల పట్ల యువత ఆకర్షితులను చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు లోకం కృష్ణయ్య, గుడిబండి వెంకటరెడ్డి, లంక లక్ష్మీనారాయణ, నిర్మలప్రభాకర్, వెంకట్రావు, బుర్రా మోహనకృష్ణ, చాగంటి సాయిలక్ష్మి, రామారావు, భాగిశాస్త్రి, నామా చంద్రబాబునాయుడు, పరమేశ్వర్, రమణాచారి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు సాయిబాబా

రాష్ట్రంలో కుంటుపడిన ప్రజారోగ్యం: టీడీపీ

రాంనగర్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఆరోగ్యానికి సరైన ప్రాధాన్యం ఇవ్వకపోవడంతో ప్రస్తుత కాంగ్రెస్ పాలనలో ఎటువంటి మార్పు లేక ప్రభుత్వ ఆస్పత్రులు ప్రత్యక్ష నరకకూపాలుగా మారాయని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా ఆరోపించారు. బుధవారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ప్రజల ఆరోగ్యం పూర్తిగా కుంటుపడిపోయిందన్నారు. ఒకవైపు కరోనా విస్తరిస్తుండడంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారని అన్నారు. ఎర్రగడ్డ మానసిక చికిత్స కేంద్రంలో 70 మందికి పైగా కలుషిత ఆహారం తిని ఒక వ్యక్తి మరణించడం, కొంత మంది పరిస్థితి విషమంగా ఉన్నా ఆరోగ్య శాఖ మంత్రి ఏం చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో టీడీపీనేతలు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్ పాల్గొన్నారు.



ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్

కంటోన్మెంట్ అభివృద్ధికి కృషి : ఈటల

సికింద్రాబాద్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తనపై ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయనని, సికింద్రాబాద్ కంటోన్మెంట్ అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తానని మల్కాజిగిరి లోక్‌సభ సభ్యుడు ఈటల రాజేందర్ అన్నారు. ఎంపీగా ఎన్నికై ఏడాది పూర్తయిన సందర్భంగా బుధవారం 3వ వార్డు అన్నానగర్ జంక్షన్‌లో బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈటల రాజేందర్‌కు సన్మానసభ ఏర్పాటు చేసి బి.ఎన్.శ్రీనివాస్‌తోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఈటల రాజేందర్‌ను సత్కరించారు. అనంతరం ఈటల రాజేందర్ మాట్లాడుతూ సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లోని అన్ని కాలనీలు, బస్తీల్లో మౌలిక సదుపాయాల మెరుగుతోపాటు పలు అభివృద్ధి పనులు చేపడుతున్నామని వెల్లడించారు. బి.ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్న ఘనత ఈటలకే దక్కుతుందని తెలిపారు. 3వ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, శ్యాంసుందర్‌గౌడ్, అరుణ్, మధు, హరికృష్ణ తదితర నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ పనులకు శంకుస్థాపన

కంటోన్మెంట్ 5వ వార్డు జ్యోతి కాలనీలో చేపట్టిన భూగర్భ డ్రైనేజీ పనులకు ఈటల రాజేందర్ శంకుస్థాపన చేశారు. కాలనీల్లో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను బలోపేతం చేస్తామని ఆయన వెల్లడించారు. కంటోన్మెంట్ శాసనసభ్యుడు ఎన్.శ్రీగణేష్, కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద పాల్గొన్నారు.

గృహ కార్మికుల సమస్యలను పార్లమెంట్‌లో లేవనెత్తాలి

బౌద్ధనగర్/ అడ్డగుట్ట, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గృహ కార్మికుల సమస్యలను, డిమాండ్స్‌ను పార్లమెంట్‌లో లేవనెత్తాలని గృహ కార్మికుల యూనియన్, నేషనల్ ప్లాట్‌ఫారం డొమెస్టిక్స్ వర్కర్స్ యూనియన్ నాయకులు బుధవారం మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఇళ్లల్లో పనిచేసే గృహ కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని వారు ఎంపీ దృష్టికి తీసుకువచ్చారు. జూన్ 16న జరిగే గృహ కార్మికుల దినోత్సవ కార్యక్రమంలో పాల్గొనాలని ఆయనను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ లిస్సీ జోసెఫ్, గృహ కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు వి.మంజుల, డొమెస్టిక్ వర్కర్స్ స్టేట్ కో-ఆర్డినేటర్ జనస్టన్, సభ్యులు మనోహర, శోభ, మాధురి, నిర్మల, పవన్, నవనీత తదితరులు పాల్గొన్నారు.